# ఈ వారం కథ

# నే చెప్పేది నిజం

**- ఎల్.వి.ప్రసాద్**

**ఉగాది పోటీలో ఎంపికైన కథ**

"ఈ కథ చదివే పెద్దలకు, పిన్నలకు, మేధావులకు, మంచి మనసున్న మంచి మనుషులకు చేతులెత్తి దండం పెడుతున్నా. నిజం చెప్పాలంటే నా కోసం నా అవసరం కోసం నే పుట్టినకాడ్నుంచి ఇప్పటిదాకా ఎవ్వరికి దండం పెట్టిందిలా... నాకు బాగా సమస్యగా మారిన మా ఊరి వెంకడికోసం, మీ అందరికీ దణ్ణం పెడుతున్నా. మా ఊర్లో పిల్లా పెద్దా, ముసలి ముతకా అందరూ వాడ్ని ఎర్రెంకడు అని అంటారు. నాకు మాత్రం ఆడ్ని అలా పిలవడం ససేమిరా ఇష్టం లేదు. నిజానికి వాడు చాలా తెలివిగల్లోడు ఊరంతా ఎర్రెంకా అంటే, నేనొక్కడ్నే తెలివిగల్ల ఎంకా అంటే, ఊరందరిదీ ఒక దారి ఉలిపి కట్టెదొక దారి అంటారని నేను కూడా నలుగురుతోపాటు, విక్రమార్కుడు రాజైనా భేతాళుడు భూతమైనా భేతాళుడి ప్రశ్నలకు విక్రమార్కుడి తల బ్రద్దలైనట్లు ఈ ఎర్రెంకడి ప్రశ్నలకు నా తల బద్దలై, కళ్ళు పేలుతున్నాయి. అట్టాగని ఆడి ప్రశ్న తలతినేది కాదు, మెదడులో ఆలోచన పెంచేదే... ఆడి ప్రశ్నకు సమాధానం చెప్పలేక ఊరొదిలెల్లినోళ్ళు చానామందున్నారు. ఆడికో ధర్మసందేహం వుందట, నీకు ఎప్పుడు ఖాళీ వుంటదో సెప్పు పెద్దన్న. ఆ ప్రశ్న అడుగుతానంటాడు. వాస్తవానికి నేను ధైర్యస్తుడ్నే ఆడంటే నాకు భయం లేదు కానీ ఆడి ప్రశ్నంటేనే కాస్తంత...

వాడి ప్రశ్నేందంటే... జనమందరూ మంచి అనే మనిషి ఎవరు? జనమందరి చేత మంచి అనిపించుకోవాలంటే ఏం చెయ్యాలా? అని, ఓస్... ఇంతేనా... ఈ మాత్రం ప్రశ్నకు సమాధానం చెప్పలేక మీ అందరికీ దణ్ణం పెడుతున్నాననుకుంటే పొరపాటే... ఫస్ట్... ఫస్టు... నేను అట్టే అనుకొనే ఆడికి దొరికి ప్రాణాలమీదకు తెచ్చుకున్నా...

ఏదేమైనా... ఊసులాపి విషయానికొస్తా, మంచి పనిచేస్తే జనమంతా మంచంటారు అందులో ఆలోచించేదేముంది. దాదాపు ఈ ప్రపంచంలో మంచి మనిషి, నాలుగు అచ్చరాలు, నాలుగు మంచి మాటలు చెప్పి చక్కగా బ్రతకడానికి మార్గం చూపే మార్గదర్శకుడు బడిఅయ్యోరు. అందుకే ఎర్రెంకడి ప్రశ్నకు సమాధానంగా బడి అయ్యోరు అని సెప్పినా, ఆ మాటతో "వస్తా పెద్దన్నా" అంటూ ఎర్రెంకడు ఎళ్ళిండు. హమ్మయ్య బతికిపోయినా! ఎర్రెంకడి నుండి తప్పించుకున్నోళ్ళలో మొట్టమొదటోడ్ని నేనే."

సరిగ్గా రెండంటే రెండ్రోజులే... పొద్దున్నే తలుపు తీసినా గుండె జల్లుమంది! ఎదురుగ్గా ఎర్రెంకడు, "ఏంటి పెద్దన్న అట్టా నీలుక్కుపోయినావు?" నువ్వు సమాధానం సెప్పినంకా మన ఊరి ఇస్కూలుకాడికి పోయినా, కొత్తగా వచ్చిన హెడ్ మాస్టారమ్మగోరు మన బడికి వచ్చినంక బళ్ళో పిల్లలకి భలే క్రమశిచ్చన నేర్పినాది, పేద పిల్లలకు యూనిఫామ్ కొనిచ్చి అవసరమైతే ఫీజులు కూడా తనే కట్టినాదని ఆమె వచ్చినంకే పదో తరగతిలో ఎన్నడు రాని జిల్లా సెకండ్ ర్యాంక్ వచ్చినాదని, ఆఫీసర్లు కూడా మెచ్చుకున్నారని ఆమె రాకతో ఊళ్ళో పిల్లలంతా బాగుపడ్డారని చెబితివే..." అంటూ ఇంకా ఏదో చెప్పబోతున్న వెర్రెంకడి మాటలకు అడ్డుతగిలిన పెద్దన్న, "ఇప్పుడు ఆమె మంచితనానికి ఏం మచ్చొచ్చినాదిరా?" ఆ మాటకు ఎర్రెంకడు "వస్తున్నా... వస్తున్నా... ఆ మాటకే వస్తున్నా ఆ బళ్ళో పనిచేసే అయ్యోర్లని, బడి గంట కొట్టే టైంకి రమ్మని గంటకొట్టినంక వెళ్ళమని, చదువులో ఎనకబడ్డ పిల్లలకు అవసరమైతే చెప్పిన పాఠం మళ్ళీ చెప్పమని చెప్పినాదంట". అంతే ఆ మాటతో అప్పటిదాకా నాలుగు గ్రూపులుగా వున్న అయ్యోర్లందరూ కలసి కారాలు, మిరియాలు నూరుతూ ఆమె మీదకు పోయి "ఏ ఉద్యోగస్తుడైనా టైంకి రావటం యాడైనా చూసినారా? నీకు పనిలేకపోతే మాకు పనిలేదా ఏందీ? లేకపోతే దేశాన్ని నువ్వొక్కదానివే బాగుచెయ్యాలని అనుకుంటున్నావా? ఇట్టా అయితే చానా ఇబ్బంది?"అని అయ్యోర్లందరూ వాళ్ళ ఇష్టం వచ్చినట్టు కాగితాలు రాసి మన యం.యల్.ఏ. పాపాల పాపారావుకి పంపిన్రంట.

మంచి పనిచేస్తే జనమంతా మంచి అంటారంటివే, పాపం మన ఊరి హెడ్ మాస్టారమ్మగోరి ఇనయంలో అట్టా కాలేదే... పెద్దన్నా పప్పులో కాలేసినావు కానీ మళ్ళీ ఇంకోఛాన్స్ ఇస్తున్నా... ఈసారి కరెక్ట్ సమాధానం చెప్పాలా..." పెద్దన్నకు మళ్ళీ వెర్రెంకడి సమస్య మొదలైంది. చేసేదేమి లేక మరో సమాధానం చెప్పినా.


"డాక్టర్ వృత్తి చాలామంచిది. కావాలంటే మనూరి డాక్టర్‌ని చూసినావా ఆయన ఈడికొచ్చినంక రోగులకు ధైర్యం వచ్చినాది, పేదోళ్ళకి దేవుడొచ్చినాడని అందరూ అనుకుంటున్నారు. అర్ధరాత్రి అపరాత్రి అని చూడకుండా ఎవరు ఎప్పుడు తలుపు తట్టినా వైద్యం చేస్తున్నాడని అందరూ అనుకుంటున్నారు. ఆమాట నీ చెవిన పడలేదా ఏంది? కావాలంటే అట్టా ఆసుపత్రికి పోయి చూసిరా"అని ఆ పూటకు వెర్రెంకడి నుండి తప్పించుకున్నాడు పెద్దన్న.

ముచ్చటగా మూడో రోజు మళ్ళీ వెర్రెంకడు పెద్దన్న గుమ్మంముందు ప్రత్యక్షం. పెద్దన్నకు గుండె జారిపోయినాది ఇరవైయేళ్ళ కితం సచ్చిన నాయనమ్మ గుర్తొచ్చినాది. అది సచ్చి ఎర్రెంకడిలో దూరిందేమో అనుకున్నాడు. ఏదిఏమైనా, చిక్కకుండా వుండాలే కానీ చిక్కినంక చేసేదేముంది "ఏమిరా వెంకా?"అని పలకరించినాడు.

'పెద్దన్నా! ఈసారి కూడా నువ్వు పప్పులో కాలేసినావు... ఎట్టాగంటావా? ఊళ్ళో కలరా, టైఫాయిడ్, మలేరియా వచ్చినాదా?

దాంతో ఊళ్ళో పెద్ద మనుషులంతా అమ్మోరు కన్నెర్ర చేసినాది, మంచి మేకపోతును బలిస్తే కాని అమ్మోరు శాంతించదని మేకపోతుని బలిచ్చి జాతర చేస్తిమే జాతర సంగతి అమ్మోరెరుక జబ్బులు మాత్రం తగ్గలేదా...! అసలు ఆ జబ్బులకు కారణం అమ్మోరుకాదు ఆవకాయ కాదు ఊళ్ళో మంచినీటి కుంటలో పశువుల్ని మునగనియ్యొద్దని, బహిర్భూమికి మరుగుదొడ్లు కట్టించుకోమని, రోడ్డుప్రక్కన ఈగలు ముసిరే తినుబండారాలు తినొద్దని పరిశుభ్రతను పాటించమని డాక్టర్ చెప్పినాడు కదా దాంతో ఊర్లోవున్న పెద్దమనుషులు, రైతులు అందరూ ఏకమై "అబ్బో ఈనొక్కడే శుభ్రంగా వుంటే మనమంతా మురిగ్గా వున్నామా ఏంది? తాతలనాటి నుండి మనూరి పశువులు ఆడ్నే మునుగుతున్నాయి, మునుగుతాయి కూడా... నోర్లేని పశువులు చెర్లో ఓ మూలన మునిగితే ఆ నీళ్ళకేమొచ్చినాదంట, జబ్బువస్తే మందులియ్యటమే అతని పని, ఈసారి అట్టా నోరు పారేసుకుంటే బాగుండదు" అని చెప్పినారు. అసలు విషయం మర్చిపోయినా కోళ్ళు తింటే బర్డ్‌ఫ్లూ, వేటమాంసం తింటే ఆంత్రాక్స్ వస్తుందని కొంతకాలం ఎవ్వరూ తినొద్దని మన ఊరి డాక్టర్‌గోరు మీటింగ్‌లో చెప్పనాడని మటన్ కొట్టు మస్తాన్, కోళ్ళ ఖరీమ్ ఏకంగా మీటింగ్ మీదకే కత్తులెత్తుకొచ్చినారు. జనమంతా అడ్డుకోబట్టి పాపం డాక్టర్‌గోరు పేణాలతో బయటపడ్డాడు. జబ్బులు రాకుండా జాగ్రత్తపడమని చెప్తే, జబ్బు వచ్చినంక మందులియ్యటమే ఆయన పని అంటారే! ఏం పెద్దన్నా జనాలకు మంచి చేత్తే జనమంతా మంచి అంటారంటివే మరి డాక్టర్‌గోరి ఇసయంలో అట్టా జరిగినాదేంది. అట్టాకాదు గాని ఇంకో మనిషిని చెప్పు పెద్దన్నా!" వెర్రెంకడి విశ్లేషణకు గుండె మరింత జారింది. నిజంగా ఈడు సచ్చిన మా ముసల్దే. అయినా ఎర్రెంకడికి ఒక్కసారి దొరికినంక అటో ఇటో తేలిందాకా వదలడు... చేసేదేమిలేక ఆకాశం వైపు చూసి ఆలోచనలో పడ్డా..."ఆ గుర్తొచ్చినాది రాజకీయ నాయకుడు!" అని చెప్పినా దాంతో వెర్రెంకడు నా ముఖంవైపు తన కుడిచేతిని చూపిస్తూ పడి పడి నవ్వాడనుకో, ఆడి నవ్వుతో కొష్టంలో కట్టేసిన బర్రెలు, ఆవులు తాళ్ళిప్పుకొని తలోదిక్కుకు పారిపోయినాయి. గంప కింద కోళ్ళు గంపను తన్ని మరీ చెట్లెక్కి ఏం జరుగుతుందోనని కొమ్మలచాటున నక్కి నక్కి చూస్తున్నాయి... ఉయ్యాల్లో పిల్లోడు మాత్రం ఉలిక్కిపడి లేచినాడు ఇంత జరుగుతున్నా వెర్రెంకడి నవ్వు మాత్రం ఆపలేదు... నవ్వుతూనే "ఓ పెద్దన్నా అట్టాకాదులే ఇంకోమాట చెప్పు" అని వెటకారంగా అన్నాడు... ఆడి నవ్వులో దాగున్న నిజం నాకర్థమైంది.

వెర్రెంకడి బాధ తప్పాలంటే ఏం సమాధానం చెప్పాలబ్బా!... ఐడియా... వెర్రెంకడికి పోలీసులంటే మాచెడ్డ భయం. ఆమాట చెబితే కానీ వెర్రెంకడు తన జోలికి రాడనుకున్నాడు... "ఒరే వెర్రెంకా ఆ వెటకారపు నవ్వాపు. నీ ప్రశ్నకు సరైన సమాధానం "పోలీస్" అంతే లాడెన్ పేరు చెబితే బుష్ ముఖం ఎట్టా రంగులు మారిద్దో అట్టా మారినాది వెర్రెంకడి ముఖం. విఠలాచారి దర్శకత్వంలో దెయ్యం మాయమైనట్టు క్షణాల్లో వెర్రెంకడు మాయమైనాడు. హమ్మయ్య ఈ దెబ్బతో వెర్రెంకడు ఈ పరిసరాలకు రాడనుకున్నాడు





పెద్దన్న. కానీ... మనస్సులో ఎక్కడో మిణుకు మిణుకుమనే భయం... ఎట్టాగైతేనేం కొద్దిరోజులపాటు ఊపిరి పీల్చుకో వచ్చు అనుకున్నాడు. సరిగ్గా వారమంటే వారమే పొద్దున్నే పెద్దన్న తలుపు తీసినాడు. దట్టంగా మంచు ఇంటి ఎదురుగా వరిగడ్డివాము, దాని ప్రక్కనే దిష్టిబొమ్మ... "ఇంటి ముందు దిష్టిబొమ్మ పెట్టినారేందిరా! తీసి పొలంలో పెట్టండి" అంటూ పాలేరుకి కేకేసినాడు. ఎంతకీ పాలేరు రాకపోయేసరికి పెద్దన్న మంచు తెరలని నెట్టుకుంటూ దిష్టిబొమ్మని తియ్యడానికి పోయినాడు... దిష్టిబొమ్మ ఎత్తబోయినాడు. "ఏంది పెద్దన్నా బొత్తిగా మనుషుల్ని మర్చిపోయినావే" అనే మాటలు పెద్దన్న చెవిన పడ్డాయి. ఆ గొంతు వెర్రెంకడిదే అని గమనించిన పెద్దన్న చుట్టూ చూడసాగాడు. మళ్ళీ వెర్రెంకడు "ఓ పెద్దన్నా నీ ఎదురుగానే వున్నా నువ్వు దిష్టిబొమ్మ అనుకుంటున్నావే అది దిష్టిబొమ్మ కాదు. నేనే నీ అందాల వెర్రెంకడ్ని". అని ముసి ముసి నవ్వులు నవ్వుకున్నాడు. ఆ షాక్ నుంచి తేరుకున్న పెద్దన్న "ఒరే వెర్రెంకా విపరీతమైన పొగ మంచులో ఇంత పొద్దున్నే ఎట్టా వచ్చినవురా?". "పొద్దున కాదు పెద్దన్నా రాత్రే వచ్చినా ఆ జామున నిద్ర లేపటమెందుకులే అని గడ్డివాముకాడ కూర్చున్నా, ఏమీ లేదు పెద్దన్నా నువ్వు మళ్ళీ పప్పులో కాలేసినావని చెప్పటానికి వచ్చినా ఏంది పెద్దన్నా ఆముదం తాగినట్టు ముఖం అట్టా పెట్టినావు, చెబుతా యినుకో, జనాలకు మేలుచేస్తే జనమంతా మెచ్చుకునే మనిషి పోలీస్ అని చెప్పినావు కదా! నీ మాట ఖాయం చేసుకొని ఊళ్ళోకి పోయినానో లేదో రోడ్డు నిండా గుంపులుగుంపులుగా జనం, ఆ జనాన్ని నెట్టుకొని జనంలోకి పోయినా మనసు చలించి పోయినాదనుకో తెల్ల సుమోకారు రోడ్డుప్రక్కనే గుడిసెలేసుకున్న బడుగోళ్ళ ఇళ్ళలోకి దూసుకుపోయి నలుగురు పేణాలను తీసింది. దాంతో అంకుశంలో హీరో రాజశేఖర్ మల్లే కొత్తగా వచ్చిన యస్.ఐ.గోరు బడుగోళ్ళదైనా, బలిసినోడిదైనా ఒకే పేణం, ఒకే రక్తం వాళ్ళ పేణాలకు లెక్కకట్టి డబ్బులు కక్కిస్తానని, పేణాలు తీసినోడ్ని శిక్షిస్తానని, సుమోకారు నడిపిన కుర్రోడికి సంకెళ్ళేసి మరీ పోలీస్‌స్టేషన్‌కి తీసుకెళ్ళిండు. అప్పుడు సూడు పెద్దన్న ఆడున్న జనమంతా "యస్.ఐ. జిందాబాద్, యస్.ఐ. జిందాబాద్" ఒకటే కేకలు... ఊరికి కాపాడే మగాడొచ్చాడని ఒకటే గుసగుసలు. అయినా ఏమి జరిగిద్దోనని నేను కూడా పోలీస్ స్టేషన్‌కెళ్ళి పడమటే వున్న కిటికీలోనుండి తొంగి తొంగి చూస్తున్నా, తీరా యస్.ఐ.గోరు స్టేషన్‌కొచ్చేసరికల్లా ఏకంగా యస్.ఐ. కుర్చీలోనే కూర్చొని తాపీగా చుట్ట కాలుస్తూ మన యం.యల్.ఏ. పాపాల పాపారావుగోరు. నిద్రపోయే మనిషి మీద పులిపడ్డట్టు బిత్తరపోయిన పోలీసాయన "నమస్తే సార్ మీరేంది ఇక్కడ? కబురు పెడితే నేనే వచ్చేవాడ్ని కదా ఏం పనిమీద వచ్చారండీ అన్నాడు?" దాంతో మన పాపాల పాపారావుగోరు "అబ్బో ఏం తెలివిగా మాట్టాడుతున్నావే, పోలీసు అనిపిచ్చినావు, ఆడెవురనుకుంటున్నావు?" "సార్ వాడు..." అని చెప్పబోయిన యస్.ఐని "ఏమయ్యా వాడు వీడు అని నోరు పారేసుకుంటున్నావే, నోరు జాగ్రత్త, నువ్వు సంకెళ్ళేసింది ఎవరనుకున్నావు! మన నియోజకవర్గానికి వాడు నా వారసుడు" ఖంగుతిన్న యస్.ఐ.కి నోట మాట రాలేదు. అయినా ధైర్యం తెచ్చుకొని "సార్ తమరి కుమారుడు నలుగురు ప్రాణాలను పొట్టన పెట్టుకున్నాడు" అని ఏదో చెప్పబోతున్న యస్.ఐ మాటలకు అడ్డుతగిలి "అయితే నలుగురికి నాలుగు లచ్చలు పడేస్తాను.. ఇంద నీ వాట. ఏం పోలీసువయ్యా ఇట్టాగైతే ఎట్టా బతుకుతావు? కాస్తా మంచి మర్యాద వుండాలి, నీతి నిజాయితీ అంటే మూటాముల్లే సర్దుకుపోవాల జాగ్రత్త!" అంటూ నోటికొచ్చినట్లు మాట్లాడి వాళ్ళ కొడుకును దర్జాగా తీసుకొని పొయ్యిండు.

"చూడు పెద్దన్నా గంట ముందు యస్.ఐ. జిందాబాద్ అని జనమంతా జైకొట్టా! ఆ జనం ఎన్నుకున్న నాయకుడేమో ఛీకొట్టా!... ఇదెట్టా కుదిరేది కాదు కాని ఇంకేదైనా చెప్పరాదా."

వెర్రెంకడి ప్రశ్నలకు సమాధానం చెప్పలేమని, తెలిసి తెలిసి పులి నోట్లో తల పెట్టడమంటే ఇదే మరి. తల పెట్టినాక ఊరుకుంటే పోయేది మన తలే. పెట్టినంక ఎలాగైనా బయటపడాల్సిందే.. ఆలోచించేకొద్దీ కళ్ళు బైర్లు కమ్మి ఊరంతా చీకటైంది. చిమ్మచీకటి... ఆ చీకట్లో కళ్ళకు గంతలు కట్టుకొని ఓ దేవత... ఆ ... న్యాయదేవత గుర్తొచ్చింది. ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా వెర్రెంకడికోసం వేట ప్రారంభించిన చెరువుగట్టు మీద నేరేడుకాయలు కోస్తున్నాడని పుల్లలేరుకొస్తున్న పుల్లమ్మ చెప్పినాది. క్షణాల మీద చెరువు గట్టుకుచేరినా అదిగదిగో అల్లంత దూరాన దున్నపోతు మీద కూర్చొని వెర్రెంకడు దర్జాగా వస్తున్నాడు. ఆడు నన్ను పెట్టే బాధలు చూస్తే యమధర్మరాజే వెర్రెంకడి రూపంలో వస్తున్నాడేమో అనుకున్నా, ఏదేమైనా ఈ పూటతో వెర్రెంకడి బాధ వదులుద్ది. బుద్ధుంటే ఇట్టాంటి చిక్కు ప్రశ్నల్లో చిక్కుకొని చితికి పోకూడదనుకున్నాడు. "ఒరే వెర్రెంకా! ఈ దెబ్బతో నీకు నాకు చెల్లు నీ ప్రశ్నకు సరైన సమాధానం, సత్యమేవ జయతే అంటూ అన్యాయం, అధర్మం చేసేటోళ్ళను న్యాయదేవత సాక్షిగా నిలదీసి వాళ్ళ నిగ్గుతేల్చి శిక్ష పడేటట్టుచేసే లాయర్ వృత్తి చాలా మంచిది. జనమందరికి మేలు చెయ్యొచ్చు." ఆ మాట పూర్తిఅయ్యేలోపే వెర్రెంకడు హ్హా... హ్హా... హ్హా... ఒకటే నవ్వులు... వాడి నవ్వుతో పెద్దన్నకు యాడ్నో కాలినాది "ఒరే వెర్రెంకా! అట్టా నవ్వితే బాగుండదు మర్యాదగా చెప్పి నవ్వు."

"చూడు పెద్దన్నా గంట ముందు యస్.ఐ. జిందాబాద్ అని జనమంతా జైకొట్టా! ఆ జనం ఎన్నుకున్న నాయకుడేమో ఛీకొట్టా!... ఇదెట్టా కుదిరేది కాదు కాని ఇంకేదైనా చెప్పరాదా."

"ఊరుకో పెద్దన్నా! నీది మరీ ఇద్దూరం నవ్వకూడా నన్ను ఎర్రెంకడనుకుంటున్నావా ఏంది? ఎందుకు నవ్వినావో చెబుతా ఇను. ఊరంతా చూస్తుండగానే నడి ఊళ్ళో మంత్రిగోరిని కత్తులతో, తుపాకులతో దాడిచేసి ప్రాణాలు తీసినోడ్ని, మనిషిని మనిషి చంపుకోవడం రాక్షసత్వం, మానవత్వమే మనిషి తత్వం, అని న్యాయదేవత సాక్షిగా వాదించి శిక్షపడేటట్టు చేసిన లాయర్‌ని, వారం తిరక్కముందే అదే నడి వీధిలో అల్లరి మూకలు చంపలేదా, దాంతో ఆయన పెళ్ళాం బిడ్డలు వీధిన పడిన విషయం నాకు తెల్దా ఏంది. భలే వాదిచ్చిండు లాయర్ అంటే ఈయనే... ఇట్టాంటోళ్ళుంటే న్యాయం ఎన్నాళ్లైనా బ్రతికుంటుంది. అని పత్రికలు ఫొటోలతో మరీ పొగిడితిరే... చివరకు ఆయన చూపిన న్యాయం, ఆయన చేసిన ధర్మం ఆయనకేమైనా అక్కరకొచ్చినాదా! మంచిచేస్తే మంచంటారంటివే! ఏంది పెద్దన్నా ఇదేనా మంచంటే భలే చెప్పినావులే! ఎందుకులే పెద్దన్నా ఈ ఎర్రెంకడి చేతిలో ఓడిపోయినానని ఒప్పేసుకో. ఈ ప్రశ్న ఎత్తుకొని నాకు దిక్కున్నకాడికి పోతా." ఆడి మాటలు పెద్దన్నలో మరింత పట్టుదలను పెంచాయి. ఒకవేళ పెద్దన్న ఒప్పుకున్నా తన మనస్సు మాత్రం ఒప్పుకోదు. తన మనస్సును కాదని తానొప్పుకున్నా తన మనస్సు మాత్రం తనని బ్రతికనియ్యదని తెలుసు. ఎట్టాగైనా వెర్రెంకడికి సరైన సమాధానం చెప్పాలని నిర్ణయించుకొని జొన్న చేలో జొన్న కంకులు కోస్తున్నా... కంకులు కోస్తున్నానన్న మాటే కానీ వెర్రెంకడి ప్రశ్న నా వీపుమీదెక్కి నాట్యం చేస్తున్నట్టుంది. అదేందో కానీ ఏ జొన్నకంకిలో చూసినా వెర్రెంకడే, ఆడు నన్ను చూసి ఎగతాళిగా నవ్వుతున్నట్టే వుంది. వెర్రెంకడి మాటల్లో కూడా నిజం లేకపోలేదు, అయితే వీడి ప్రశ్నకు సమాధానం ఏందబ్బా...! ఆలోచనలో పడ్డ పెద్దన్నకు విశ్వమంతా శూన్యంగా వుంది. ఎట్టాగైనా వీడికి సమాధానం చెప్పాలి, లేకపోతే ఇన్నాళ్ళు పెద్దన్నా పెద్దన్నా అని పిలిచే ఊళ్ళో జనం చిన్నన్నా... చిన్నన్నా అని పిలిస్తే భరించలేను...రోజులు గడుస్తున్నాయి. వెర్రెంకడి గడువు దగ్గరకొస్తుంది... చేసేదేమీ లేక ఊరి బయట వున్న ఎలుకల గుహలో దాక్కున్నాడు.

రెండురోజుల నుండి పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టని పెద్దన్నను గమనించిన ఎలుకల రాజు నేరుగా పెద్దన్న దగ్గరకొచ్చి 'పెద్దన్నా! పెద్దన్నా!... రెండు రోజులనుండి నిన్ను గమనిస్తున్నాను. ఏదో పెద్ద సమస్యలో వున్నట్టున్నావే, మరోలా అనుకోనంటే నీ సమస్యేందో చెప్పరాదా! ఇంత పెద్దమనుషులం! మావల్లే కానిది చిట్టెలుకవు నీ వల్లేమౌతుందని అనుకుంటున్నావా ఏంది...? ఏమో చెప్పలేము. ఏ పుట్టలో ఏ పాము వుంటుందో!" అంది ఎలుకల రాజు. ఆ మాటలు పెద్దన్నకు కొంత ఆశను కల్పించాయి. తన సమస్యను చిట్టెలుకతో పూసగుచ్చినట్లు చెప్పాడు.

"కిచ్... కిచ్... కిచ్..." అని హేళనగా నవ్వి తన మూతిని వీలైనంత ముందుకు చాపి రెండు పళ్ళు చూపిస్తూ "కిచ్..కిచ్... కిచ్..."మని హేళనగా ఇకిలించింది. "ఓస్... ఇంతేనా ఈమాత్రం దానికి ఇంత గాబరా ఎందుకు పెద్దన్నా నీ సమస్యకు సరైన సమాధానం నా కథే" అంటూ తన కథను ప్రారంభించింది.

"పుట్టుకతో నాకు నాలుగు తోకలుండేవి.. ఎవ్వరికీ రాని ఈ అరుదైన రూపం చూసి నాలో నేను గర్వపడేదాన్ని. చాలామంది జనం ఆశ్చర్యంగా చూశారు. పత్రికల్లో కూడా నా ఫొటో వేసి భలే భలే మెచ్చుకున్నారు. రోజులు గడిచే కొద్దీ కొందరు "నాలుగు తోకల ఎలుక... నాలుగు తోకల ఎలుక" అని హేళన చేసేవారు. దానితో విసిగిన నేను, దర్జీ దగ్గరకెళ్ళి ఒక తోకను కత్తిరించుకున్నాను. మళ్ళీ అదే జనం "మూడు తోకల ఎలుక... మూడు తోకల ఎలుక" అని యధావిధిగా గేలి చేసేవారు. ఏందబ్బా ఈ మనుషుల మనస్సులు అనుకొని ఎలాగైనా జనమందరు ఇష్టపడేలా, జనమందరిచేత మంచి అనిపించుకోవాలని మరో తోకను కత్తిరించుకున్నాను. ఏమాత్రం లాభం లేదు. కానీ జనంలో మార్పురాలేదు. తోటి ఎలుకలలో ఎలుకగా నలుగురిలో ఒకరిగా వుండాలని ఎంచక్కా అందరిలా వుంటే ఎవ్వరూ ఏమీ అనరని రెండు తోకల్లో ఒక తోకను కత్తిరించుకున్నా... ఫ్చ్... జనం మరలా! "ఒక్క తోక ఎలుక... ఒక్క తోక ఎలుక"అని (మిగతా 21 వ పేజీలో)

# చిత్రమైన జిరాఫీ!

జంతువులు అన్నిటిలోకి జిరాఫీలు చిత్రమైనవి. అనాది కాలంనుంచీ ఈ జిరాఫీ మానవులను ఆశ్చర్య చకితుల్ని చేస్తూనే ఉంది. అందుకు కారణం- దానియొక్క అసాధారణ శరీరం!

ప్రాచీన కాలంలో ఈజిప్ట్ దేశంలోని ప్రజలు జిరాఫీ- చిరుత పులి, ఒంటెల కలయిక అని నమ్మేవారు! అందువల్లనే అవి ఒంటెలనుంచి తమ పొడవును, చుక్కల చర్మాన్ని చిరుత పులుల నుంచి పొందామని భావించేవారు. కనుక వారు అప్పట్లో జిరాఫీకి పెట్టిన పేరు 'కామివోపార్డ్'. శాస్త్ర రీత్యా వారి నమ్మకానికి ఎటువంటి రుజువూ లేదు.పేరుప్రఖ్యాతులు పొందిన జంతు శాస్త్రజ్ఞుడు జీప్ బాప్టిస్టీడిలా మార్క్, జిరాఫీ పట్ల తన అభిప్రాయాన్ని ఇలా చెప్పాడు.

"ఒకప్పుడు జిరాఫీ మెడలు ఇప్పటి మెడలకన్నా పొట్టిగా ఉండేవి. అతి ఎత్తయిన చెట్లపైన ఉండే లేలేత ఆకులను తినడానికి అలవాటుపడిన జిరాఫీలు తమ మెడలను ఆ ఆకులకోసం అదే పనిగా సాగదియ్యడంవలన, చివరికి అవి అలా సాగి, పొడవైనవి అయ్యాయి!"అయితే ఇతర సైంటిస్టులు అతని అభిప్రాయాన్ని ఆమోదించలేదు. చిత్రమేమిటంటే జిరాఫీ శరీరంనుంచి మెడ మినహాయించినప్పుడు మిగిలిన దాని శరీరం ఒక మామూలు గుర్రం శరీరంకన్నా పెద్దది కాదు! ఆశ్చర్యం కలిగించే జిరాఫీ ఎత్తు 19 అడుగులు. తమాషా ఏమంటే జిరాఫీ కంఠ నాళాలు, మన కంఠంలోని నాళాలు ఏడే! అయితే దాని కంఠంలోని నాళాలు మన నాళాలకన్నా పొడవైనవి. ఇది తన మెడను కిందికి వంచలేదు. నీరు తాగాల్సి వచ్చినప్పుడు పైనుంచి కిందికి పడే నీటిని, నదీ ప్రవాహంలోని జలాన్ని మాత్రమే తాగ గలుగుతుంది. కింద పడివున్న ఆకులు అలములు తినడానికి ప్రయత్నించినప్పుడు తన కాళ్లను అతి కష్టంమీద చాపి ఎంతో శ్రమ పడి తల వంచుతుంది. ఆ సమయంలోనే దానికి ప్రమాదం సంభవిస్తుంది. కొన్ని జంతువులు దానిపై దాడి చేస్తాయి. అప్పుడు దానికి తిరిగి నిలబడి పరుగులు తియ్యడానికి వీలు పడదు. అవి కేవలం ఆకులు తిని జీవిస్తూ ఉంటాయి. ఎత్తయిన జిరాఫీ ఒక భవనంముందు నిలబడినప్పుడు, దాని మెడ ఆ భవనం రెండవ అంతస్తులోని కిటికీ వరకూ చేరుకోగలదు. దానికి పొడవైన మెడతోపాటు పొడవైన నాలుక సహితం ఉంది. సదరు నాలుక పొడుగు 21 అడుగులు! అది తన చెవుల్లోకి తన నాలుకను పంపి, వాటిని శుభ్రం చేసుకుంటుంది!

జిరాఫీకి అవసరమైన గడ్డి దొరకనప్పుడు, ముళ్ల చెట్లకు వున్న ఆకులను తింటుంది. ఆ ముళ్లవలన తన నాలుకకు ఏ ప్రమాదం రాకుండా జాగ్రత్తగా ఆకులు తింటుంది. ఇతర జంతువుల వలన ప్రమాదం ఏర్పడినప్పుడు బహు నేర్పరితనంతో తప్పించుకొంటుంది. అటువంటప్పుడు చెట్ల నీడల్లో నక్కుతుంది. అందువలన దాని శరీరంమీదున్న రంగు చుక్కల వలన ఆ నీడల్లో అది కలిసిపోతుంది. జంతువులు దానిని గుర్తించలేక వెళ్లిపోతాయి.

జిరాఫీ చెవులు అతి చిన్న శబ్దాన్ని సహితం పసిగట్టగలుగుతాయి. వెంటనే తగు జాగ్రత్తలు తీసుకొంటుంది. వాసనలు కూడా వెంటనే గ్రహిస్తుంది. దానికి చక్కటి కంటి చూపు ఉంది. గంటకు 55 కిలోమీటర్ల వేగంతో గెంతుతూ పరుగులు తీస్తుంది. అయితే ఆ వేగాన్ని కొద్ది దూరంవరకు మాత్రమే సాగించగలదు. తన పొడగరితనం వలన దూరంలోగల సింహాలను, పులులను ముందుగానే చూడగలుగుతుంది. తన మీదకు లంఘించడానికి ఏ జంతువుప్రయత్నించినా, తన బలమైన కాళ్లతో వాటిని అతి గట్టిగా మోద గలుగుతుంది. తలను కూడా విసురుగా ఆయా జంతువులపై విసుర్తుంది. దాని తల ఒక బలమైన ఆయుధంవలే పనిచేసి, జంతువులు దూరంగా పరుగులు తీస్తాయి. చిన్నచిన్న గ్రూపులుగా అవి సంచరిస్తాయి.

ప్రతీ గ్రూపునకు ఒక మొగ జిరాఫీ నాయకత్వం వహిస్తుంది. రోజుల తరబడి నీరు లభించకపోయినా అవి బతక గలవు. జిరాఫీలు నిలబడే నిద్రిస్తూ ఉంటాయి.

**- కొడిమెల శ్రీరామమూర్తి**

## ఈ వారం కథ

( 8వ పేజీ తరువాయి)

ఎగతాళి చేశారు. ఎలాగైనా నన్ను గేలి చేసిన జనమందరి నోటితోనే మెచ్చుకొనేలా చెయ్యాలని గుండెలో బాధను గుండెలో దిగమించుకొని చివరకు నాకంటూ మిగిలిన ఒక్కగానొక్క తోకను కత్తిరించుకొని నెమ్మదిగా ఊర్లోకి నడుచుకుంటూ వస్తున్నా... అల్లంత దూరంలో నన్ను ప్రతిరోజూ గేలిచేసే జనం నావైపు అలానే నిశ్శబ్దంగా చూస్తూ వున్నారు. జనమందరూ ఇష్టపడాలని ఎంత కష్టమైనా భరించి ఇంత త్యాగం చేసిన నన్ను తప్పకుండా ఈ జనమంతా మెచ్చుకుంటారని నెమ్మదిగా వాళ్ళను సమీపిస్తున్నాను. వాళ్ళల్లోవాళ్ళు గుసగుసలు... బహుశా నన్ను మెచ్చుకోవడానికి పదాలు వెదుకుతున్నారేమో అనుకున్నాను. వాళ్ళ సంభాషణను నా చిన్ని చెవులతో రిక్కించి మరీ వినే ప్రయత్నం చేశాను. అంతే ఒక్కసారిగా నిశ్శబ్దం బద్దలైంది... మునుపటి కంటే మరింత బిగ్గరగా పిల్లాపెద్దా అంతాకలసి "తోకలేని ఎలుక... తోకలేని ఎలుకా" అని హేళన చేశారు. అంతే వాళ్ళ అరుపులకు, నేనెంత నా గుండెంత ఆ గుండె జల్లుమంది... ఒకే ఒక్క గెంతులో ఈ గుహలోకి వచ్చిపడ్డా అప్పట్నుంచి ఈ చీకటిలోనే నా బ్రతుకంతా చూడు పెద్దన్నా! ఎంత పొరపాటు చేశాను... ఈ జనమంతా మెచ్చుకుంటారని వాళ్ళ ఇష్టంకోసం ఎంత కష్టమైనా భరించి నాకిష్టమైన, ఎవ్వరికీ రాని, ఈ అరుదైన నాలుగు తోకల్ని కత్తిరించేసి చివరికి నా బ్రతుకంతా చీకటైంది."“ఓ పెద్దన్నా...! ఎలుకను చెప్తున్నా... ఎలుకే కదా, అదీ నల్ల ఎలుక ఏందిలే అని వెటకారంగా తీసి పారెయ్యమాకు. స్వీయ అనుభవంతో చెప్తున్నా లోకంలో రకరకాల మనుషులు, రకరకాల మనసులు, జనమంతా నచ్చే, మెచ్చే మనిషి ఈ భూమ్మీద పుట్టలా!... ఒక పని చేశామంటే లాభం పొందేవాడు మంచి అంటాడు, నష్టపోయేవాడు చెడ్డ అంటాడు. వెర్రెంకడి ప్రశ్న సామాన్యమైనది కాదు. సాదాసీదా వాడు సమాధానం చెప్పే ప్రశ్న అసలే కాదు. నేను చెప్పేది ఒక్కటే, నిన్ను నువ్వు ఎట్టా చూసుకుంటావో ఎదుటోడ్ని కూడా అట్టాగే చూడు. వీలైనంతవరకు ఎదుటి మనిషికి మంచి చెయ్యి, మంచి చెయ్యను మనస్సురాపోతే కీడు మాత్రం చెయ్యమాక. అదే సగం మంచి చేసినట్టు. మనుషుల మనస్సులలో మార్పు రావాలి! మంచిని మంచనే తత్వం పెరగాలి! మంచిని స్వలాభంకోసం చెడుగా చిత్రీకరించే వారిని ఛీకొట్టాలా! ఇప్పటికిప్పుడు ఈ జనాలందరిని మార్చలేము కానీ, బిడ్డ పుట్టిన కాడ్నుంచి ఉగ్గుపాలతో ఈ నీతిని నేర్పండి, తప్పకుండా నవ సమాజాన్ని చూద్దాం, మంచిని మంచనే మనుషులను తయారు చేద్దాం, మంచిని చూసి చెడు దూరంగా పారిపోయే రోజు కోసం ఎదురు చూద్దాం. వెర్రెంకడితో ఈ మాట చెప్పు. వాడ్ని మరో ముగ్గురుకి చెప్పమను. ఆ ముగ్గురు తొమ్మిది మందికి చెప్పమను. అట్టా...అట్టా ఈ ప్రపంచమంతా చెప్పమను. నే చెప్పేది నిజం". వుంటా పెద్దన్నా అవతల నాకు చానా పనుంది.

★

